# రాజ్యమేలుతున్న నకిలీ విత్తనాలు

## నష్టపోతున్న రైతాంగం

ఈ ఖరీఫ్ సీజన్లో, దుర్భిక్షం, వరదముంపు, నకిలీ విత్తనాలు రైతాంగాన్ని వెన్నంటి వస్తున్నాయి. దుర్భిక్ష పరిస్థితులవలన లక్షలాది ఎకరాల్లో సేద్యం జరక్కపోగా, సెప్టెంబర్లో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో 9 లక్షలకు పైగా ఎకరాల్లో పైర్లు మునిగిపోయాయి. ఈ నష్టాలతోపాటు నకిలీ విత్తనాలవలన వేసిన పంట నిరుపయోగమై రైతాంగం పెట్టిన పెట్టుబడిని పూర్తిగా కోల్పోయారు.

పంటల ఉత్పత్తులపై ఆంక్షలు విధించటం, ఫలానా పంటలే వేయాలని రైతులపై ప్రభుత్వాలు ఒత్తిడి పెంచటంతో తమ ఇష్టాలతో రైతాంగం సేద్యం చేయలేకపోతున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు అందించే బాధ్యతనుండి పాలకులు తప్పుకొంటున్నారు. బహుళజాతి బడా కంపెనీలు భారత విత్తన రంగాన్ని ఆక్రమించాయి. ఈ కంపెనీలను అడ్డంపెట్టుకొని తెలుగు రాష్ట్రాల్లో అనేక నకిలీ విత్తన కంపెనీలు విచ్చలవిడిగా రంగంలోకి వస్తున్నాయి. ఇవి విక్రయించే విత్తనాలను కొనుగోలు చేసి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సంవత్సరం కూడా రైతాంగానికి ఈ ఉపద్రవం తప్పలేదు.

గత రెండు సంవత్సరాలుగా మార్కెట్లో మిర్చిరేటు ఆశాజనకంగా వుండటం, పత్తిసాగుపై పరిమితి విధించబడటంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మిర్చిసాగువైపు రైతులు ఎక్కువగా మళ్లారు. తెలంగాణాలో లక్షా 60వేల హెక్టార్లలో, ఆంధ్రప్రదేశ్లో లక్షా 35 వేల 8 వందల హెక్టార్లలో మిర్చిపంట వేశారు. వీరిలో అనేకమంది రైతులు నకిలీ విత్తనాల బారినపడి 500 కోట్ల రూపాయలమేర పంట నష్టపోయారు. గత సంవత్సరం 341 సెగ్మెంట్ రకం విత్తనాల మిర్చి పంటకు మంచి ధర లభించింది. ఈ సంవత్సరం ఆ రకం విత్తనసాగుపై ఎక్కువగా రైతులు మక్కువ చూపారు. ఈ సెగ్మెంట్లోనే జీవా కంపెనీ విత్తనాలు మార్కెట్లోకి వచ్చాయి. ఎకరాకు 40 నుండి 50 క్వింటాళ్ళ దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు రైతాంగాన్ని నమ్మించారు. రైతాంగం ఆతృతను గమనించిన జీవా కంపెనీ కిలో మిరప విత్తనాలను 60వేల రూపాయలకు విక్రయించింది. ఆ విధంగా కంపెనీ విపరీత లాభాలు గడించింది.

మిరపసాగుకు ఎకరాకి కౌలుతో కలిపి లక్షన్నర పెట్టుబడి అవసరమౌతుంది. ధరలు ఆశాజనకంగా వుండి, ఆశించిన మేర దిగుబడి వస్తే మిగులు ఆదాయం లభించి రైతాంగం ఊరట చెందే పరిస్థితి వుంది. ఆశతో సేద్యం ప్రారంభించిన రైతులను నాసిరకం విత్తనాలు నిలువునా ముంచాయి. ముఖ్యంగా గుంటూరు, ప్రకాశం, కృష్ణా, కర్నూలు జిల్లాల రైతులు ఈ విత్తనాలవలన తీవ్రంగా నష్టపోయారు. నకిలీ విత్తనాలకు గుంటూరు ప్రధాన కేంద్రంగా మారింది. జీవా కంపెనీ విక్రయించిన విత్తనాలు సాగుచేసిన రైతులు పైరుకి పూత, పిందె పడక ఆకాశంవైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రకాశంజిల్లాలో మరో కంపెనీ విత్తనాలు అసలు నారు దశలోనే మొలకెత్తలేదు. గుంటూరు జిల్లాలో మేడికొండూరు, సిరిపురం, పేరేచర్ల, యలవర్తి, పెదకూరపాడు మండలాలలోని కొన్ని గ్రామాల్లో జీవా కంపెనీ మిరప విత్తనాలు సాగుచేశారు. కాయ దశలో అవి నకిలీ విత్తనాలుగా గుర్తించారు. ఇదే పరిస్థితి అనేక జిల్లాల్లో వుంది. నాణ్యతలేని నకిలీ విత్తనాలవలన పెట్టుబడితోపాటు పంటపై వచ్చే ఆదాయాన్ని రైతాంగం కోల్పోయారు.

నకిలీ బెడద మిర్చికే పరిమితం కాలేదు. పత్తి విత్తనాలదీ అదే పరిస్థితి. ఇందుకు గుంటూరు జిల్లానే కేంద్రంగా వుంది. జిల్లాలో 1,40,590 హెక్టార్లలో పత్తిసాగు చేయగా 5 లక్షల కేజీల వరకు విత్తనాలు కొనుగోలు చేశారు. నకిలీ విత్తన సంస్థలు రైతాంగాన్ని మభ్యపెట్టి పెద్దఎత్తున జేబులు నింపుకున్నాయి. వ్యవసాయశాఖా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట మండలం ఇందుకు నిదర్శనం. ఈ మండలంలోని గోవిందపురం, కోమటివాని వారిపాలెం, నాదెండ్ల మండలం అమీన్ సాహిబ్పాలెం గ్రామాల్లో రైతులు పత్తి సాగుచేయగా మొక్కలు కాయదశకు చేరుకొనేసరికి అవి నకిలీ విత్తనాలుగా తేలాయి.

ఏప్రియల్ నుండి జులై దాకా వుండే ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ అధికారులు ప్రత్తి విత్తన కేంద్రాన్ని, నర్సరీలను తనిఖీచేసి సరకు నాణ్యతను పరీక్షించాల్సి వుంది. వారు ఆ బాధ్యతను వదలివేశారు. నకిలీ విత్తన కంపెనీలతో లాలూచీపడి ఎలాంటి పరీక్షలు చేయకుండా, వాటి వ్యాపారం యధేచ్ఛగా సాగేలా సహకారాన్ని అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 15 ప్రభుత్వ విత్తన కేంద్రాలు వుంటే, ప్రైవేట్ సంస్థలు నాలుగు వందలకుపైగా వున్నాయి. వీటి వ్యాపారం 16వేల కోట్లకు పెరిగింది. పాలకులు, వ్యవసాయాధికారులు అనుసరిస్తున్న విధానాలు, నకిలీ విత్తన కంపెనీలు పెరగటానికి దోహదపడుతున్నాయి. అనేక కంపెనీలు ఎన్నో పరిశోధనలు చేశామంటూ నాసిరకం విత్తనాలను హైబ్రీడ్ పేరిట విక్రయిస్తూ రైతాంగాన్ని దోచుకోవటంతోపాటు వారికి తీవ్ర నష్టం కలుగచేస్తున్నాయి. రంగు రంగుల ప్యాకెట్లలో విక్రయిస్తున్న బి.టి. పత్తి విత్తనాలను గత సంవత్సరం డి.ఎన్.ఏ. ప్రయోగశాలలో పరీక్షిస్తే అత్యధికం నకిలీ, నాసిరకం అని తేలటమే కాకుండా ప్యాకెట్లపై కంపెనీల చిరునామాలు కూడా నకిలీ అని తేలింది. తాజాగా మిర్చి విత్తనాల భాగోతం ఈ విధంగానే వుంది.

1966 సం॥వరకు దేశంలోనూ, రాష్ట్రంలోనూ విత్తన చట్టం అనేది ఏమీలేదు. రైతాంగమే తాము పండించిన పంట నుండే మేలైన విత్తనాలను తీసి తిరిగి విత్తనంగా వాడేవారు. నకిలీ విత్తనాలు వుండేవి కావు. అందువలన ఎటువంటి విత్తనచట్టం అవసరం

లేకపోయింది. సస్యవిప్లవం పేరుతో అధిక దిగుబడులకోసమంటూ హైబ్రీడ్ విత్తనాలను దిగుమతి చేసుకోవటంతో విత్తన కంపెనీలతోపాటు నాసిరకం విత్తనాలు ఉనికిలోకి వచ్చాయి. దేశవాళీ విత్తనాల స్థానంలో హైబ్రీడ్ విత్తనాల వినియోగం ఎక్కువైంది. వీటితోపాటు బి.టి. విత్తనాలను బహుళజాతి సంస్థలు ఉత్పత్తి చేయటమేకాకుండా విత్తనరంగంపై ఆధిపత్యం చెలాయించి దేశవాళి విత్తనాలు కనుమరుగయ్యేలా చేస్తున్నాయి. పంటనుండి విత్తనం కట్టుకొనే పద్ధతి కనుమరుగైంది.

దేశవాళి విత్తనాల స్థానంలో హైబ్రీడ్, బి.టి.విత్తనాలు సేద్యాన్ని ఆక్రమించాయి. ఈ విత్తనాలవలన చీడపీడలు దిగుమతి అయి పంట నష్టపోవటం, నకిలీ విత్తనాలు, నాసిరకం విత్తనాలు రంగంలోకి రావటంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. దీన్ని నివారించి రైతుల ప్రయోజనాలు పరిరక్షిస్తామంటూ మొదటిసారిగా 1966లో కేంద్రప్రభుత్వం విత్తనచట్టం చేసింది. ఈ చట్టం నకిలీ విత్తన కంపెనీలను అరికట్టటంలోనూ, నాణ్యమైన విత్తనాలు అందించటంలోనూ, ధరలను అదుపుచేయటంలో విఫలమైంది. హైబ్రీడ్ విత్తనాలపై గుత్తాధిపత్యం వహించిన బహుళజాతి సంస్థలు ప్రమాదకరమైన బి.టి. విత్తనాలను ఉత్పత్తిచేసి ప్రపంచవ్యాపితంగా విక్రయాలు ప్రారంభించాయి. మోన్‌శాంటో ఇందులో అగ్రస్థానంలో వుంది. విత్తనాలపై గుత్తాధిపత్యం కలిగిన బహుళజాతి సంస్థలు, విత్తన ధరలను విపరీతంగా పెంచి భారత రైతాంగాన్ని దారుణంగా దోచుకొంటున్నారు.

నాణ్యతలేని విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తటం, వాటి ధరలు విపరీతంగా పెరుగుతుండటం, ప్రచారానికి అనుగుణంగా బి.టి. విత్తనాల ఉత్పత్తులు పెరగకపోవటం, బి.టి. విత్తనాలను నిషేధించాలనే డిమాండ్ ముందుకు రావటంతో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు, అలాంటి సంస్థలను, వ్యక్తులను కఠినంగా శిక్షించేందుకు కొత్తచట్టం తీసుకొస్తామని పాలకులు చెప్పక తప్పలేదు. ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ విత్తనాల ఆధిపత్యాన్ని అరికట్టక పోవటంపై పాలకులపై తీవ్ర విమర్శలు రావటంతో, వ్యతిరేకతను దారి మళ్లించేందుకు 2004లో కొత్త విత్తనబిల్లు ముసాయిదాను తయారుచేసి 2006లో శాసనసభ ఆమోదించిన తర్వాత రాష్ట్రప్రభుత్వం దాన్ని కేంద్రం అంగీకారంకోసం పంపింది. ఈ ముసాయిదా ఆధారంగా కేంద్రప్రభుత్వం 2004 విత్తనబిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా, రాజ్యసభలో ప్రవేశపెట్టటంలోనే కేంద్రంయొక్క మోసకారితనం బట్టబయలైంది. బిల్లును రాజ్యసభ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపింది. బిల్లుకు అనేక సిఫార్సులు చేసి స్టాండింగ్ కమిటీ 2006లో కేంద్రానికి పంపింది. స్టాండింగ్ కమిటీ సిఫార్సులు ప్రక్కనపెట్టి రైతాంగ ప్రయోజనాలను బలిపెడుతూ, బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్రప్రభుత్వం తిరిగి రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కేంద్రం–రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ముసాయిదా విత్తనబిల్లులు అలంకారప్రాయంగానే మూలనపడి వున్నాయి. రాష్ట్రపాలకులు బిల్లు ఆమోదంకోసం ఒత్తిడి తీసుకొని రావటంలో విఫలమైనారు. కనీసం నకిలీ విత్తన కంపెనీల నుండి రైతాంగానికి పరిహారం కూడా పాలకులు ఇప్పించలేకపోతున్నారు.

నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకొని, ఆ కంపెనీలనుండి పరిహారం ఇప్పించాలని రైతాంగం ఆందోళన ప్రారంభించారు. జీవా కంపెనీ విత్తనాలు సాగుచేస్తే పూత, పిందే రాలేదని, తీవ్రంగా నష్టపోయామని గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలోని వెలవర్తిపాడు గ్రామానికి చెందిన షేక్ ఫిరోజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నకిలీ విత్తనాలవలన లక్షరూపాయలు నష్టపోయానని, 60వేలు అప్పుచేసి మరలా పైరు వేస్తున్నానని, కంపెనీ నుండి పరిహారం ఇప్పించాలని ఆ గ్రామానికే చెందిన మరో రైతు షేక్ సుభాని వ్యవసాయశాఖను కోరుతున్నాడు. జీవా కంపెనీ నుండి విత్తనాలు కొనుగోలుచేసి 20 ఎకరాల్లో మిర్చి సాగుచేశానని, ఇప్పటికే 7 లక్షలు ఖర్చు అయ్యిందని, కాయలుకాసే దశలో నకిలీ విత్తనాలుగా తేలాయని, మరలా మొక్కలు నాటాలంటే 4 లక్షలు కావాలని, కంపెనీవారు పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఇవ్వమంటున్నారని సేద్యం ఎలా చేయాలని వాపోయాడు. నకిలీ విత్తన కంపెనీలపైన, వాటి విక్రయదారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అమరావతి–గుంటూరు రహదారిపైన తాడికొండ అడ్డరోడ్డువద్ద రైతాంగం రాస్తారోకో ద్వారా ప్రభుత్వంపై కన్నెర్ర చేశారు. పోలీసులు, వ్యవసాయాధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా వారిపై రైతాంగం ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రకాశంజిల్లాలో మరొక కంపెనీ విత్తనాలు నారు దశలోనే మొలకెత్తకపోవటంతో, రైతాంగం ఆందోళన చేసిన ఫలితంగా డబ్బులు తిరిగి ఇచ్చి, మిరపమొక్కలు సరఫరా చేయటంతో ఆందోళన సద్దు మణిగింది. ఈ జిల్లాలోని ఎర్రగొండపాలెం, దోర్నాల, త్రిపురాంతకం మండలాల్లో మూడునెలలక్రితం యుఎస్ 341, జీవా విత్తనాలతో మిరపపంట వేశారు. 42 రోజుల్లో పూత, పిందె రావాలి. ఇప్పటివరకు పూతే రాలేదని, నకిలీ విత్తనాలే కారణమని కంపెనీలు పరిహారం చెల్లించాలని ఆ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నకిలీ విత్తనాలవలన పంటను కోల్పోయి, పెట్టిన పెట్టుబడి నష్టపోయి ఆర్థికఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతుంటే, వ్యవసాయ అధికారులు ఆ కంపెనీలపై చర్యలు తీసుకోక పోవటమే కాకుండా, కనీసం పైర్లు పరిశీలించటానికి కూడా రాలేదని, వ్యవసాయశాఖ ఎందుకు వుందని రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవా కంపెనీ విత్తనాలను ఎవరు పరీక్షించి సర్టిఫై చేశారని ప్రశ్నిస్తున్నారు. కంపెనీల నుండి ఎందుకు పరిహారాన్ని రాబట్టలేక పోతున్నారని, కంపెనీలతో లాలూచీనే అందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ విత్తనాల వలన పంట నష్టపోయి మేడికొండూరు మండలం ఎలపర్తి గ్రామానికి చెందిన రైతు ఎర్రసాని విజయ్, కర్నూలుజిల్లా ప్యాపిలిలో రాయుడు పురుగుమందు తాగి ప్రాణాలు కోల్పోయారు. రైతులు ఇలాంటి ఆత్మహత్యలకు పాల్పడకుండా వుండాలంటే నకిలీ విత్తన కంపెనీలపై క్రిమినల్ కేసులతో కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఆ కంపెనీల నుండి పూర్తిపరిహారం ఇప్పించాలి. దేశవాళి విత్తనాలను అభివృద్ధిచేసి అందించాలి. బి.టి. విత్తనాలను నిషేధించాలి. ఇందుకై రైతాంగం ఉద్యమించాలి.

ooooo